క్లుప్తంగా

రావణాసురుని చిత్రపటానికి క్షీరాభిషేకం

బెల్లంపల్లి: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రావణాసురుని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా వేడుకల్లో భాగంగా రావణాసుర వధ నిర్వహించడం సరికాదన్నారు. ఆ కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నాయకులు చిలుక రాజనర్సు, కుంబాల రాజేష్, గోమాస రాజం, మల్లయ్య, మాస మురళి, కుర్సపల్లి రాజలింగు, రాజ్‌కుమార్, శేఖర్, చక్రధర్ పాల్గొన్నారు.

కూరగాయల సాగు పరిశీలన

వేమనపల్లి: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం కూరగాయల సాగును ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్ పరిశీలించారు. పందిరి సాగుతో లాభాలు ఉంటాయని, రైతులు ఈసాగుపై ఆసక్తి చూపాలన్నారు. వివరాలకు హార్టికల్చర్ 8977713960, 9381160562 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హాజీపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్


శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎంపీడీవోగా బుగ్గారం శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మధుసూదన్ ఏడాది క్రితం భీమారం బదిలీ కాగా, దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో దండేపల్లి ఎంపీడీవోను ఇన్‌చార్జి నుంచి తప్పిస్తూ లక్సెట్టిపేట ఎంపీవోగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను ఇన్‌చార్జీ ఎంపీడీఓగా నియమిస్తూ కలెక్టర్ కుమార్‌దీపక్ ఉత్తర్వులు చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఎంపీడీవో ప్రసాద్, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కార్మికులకు వైద్యపరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బందికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది రాకేశ్, రాజేశ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గంగమ్మ సల్లంగ చూడమ్మ


శోభాయాత్రలో మహిళల నృత్యాలు

వేమనపల్లి: మండల కేంద్రంలో గంగదేవి ఉత్సవాల సందర్భంగా జాలర్లు శుక్రవారం గంగాదేవి విగ్రహంతో డీజేచప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, యువతి, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం జాలరివాడలో మత్స్యకార కార్మిక సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గంగమ్మ తల్లి సల్లంగ చూడమ్మ అంటూ మొక్కుకున్నారు. వారంపాటు పూజలు ఉంటాయని గంగపుత్రులు తెలిపారు.

రేవంత్‌రెడ్డి, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జన్నారం: అంగన్‌వాడీ పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్ పాల్గొన్నారు.

జలమయమైన వీధులు


ఆస్నాదలో జలమయమైన వీధి

చెన్నూర్‌రూరల్: మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి ఆస్నాద గ్రామంలోని పలు కాలనీలు జలమయ మయ్యాయి. కాలనీల్లో సరైన మురుగుకాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు ఎటు వెళ్లలేక రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు పట్టించుకుని మురుగు కాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిల్ రోడ్డుతో కష్టాలు

- భీమారం–కొత్తపల్లి దారిలో వాహనాల రద్దీ
- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

భీమారం: భీమారం–కొత్తపల్లి సింగిల్ రోడ్డుతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఈ మార్గం గుండా వెళ్లే వాహనాలతో రద్దీ పెరిగింది. సింగిల్ రోడ్డు కావడం, ఇరువైపులా చెట్లు ఆక్రమిస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భీమారం నుంచి కొత్తపల్లికి 10 కి.మీ కాగా, 22 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం బీటీ రోడ్డుగా నిర్మించింది. అప్పటి అవసరాలకు ఇది ఎంతో ఉపయోగపడింది. భీమారం, చెన్నూర్ మండలాలకు ఈ రోడ్డు కలుపుతుంది. చెన్నూర్ మండలం ఆస్నాద ప్రధాన రోడ్డులోని కొమ్మెర ఎక్స్‌రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు 9 కి.మీ సింగిల్ బీటీ రోడ్డు నిర్మాణంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. మంచిర్యాల నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైపు వెళ్లే వాహనాలు భీమారం, కొత్తపల్లి మీదుగా అన్నారం బ్యారేజీ మీదుగా వెళ్తున్నారు. తక్కువ దూరం వస్తుండడంతో వాహనాల రాకపోకలు, వివిధ అవసరాలకు మండల ప్రజలు వెళ్తుంటారు. అంతర్‌జిల్లా ప్రయాణికులు, స్థానిక ప్రజలు వాహనాలు వెళ్తుండడంతో ఈ రూట్‌లో రద్దీ పెరిగింది. దీంతో ట్రాఫిక్ ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు ఎదురుగా వస్తే మరొటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సింగిల్ రోడ్డుని డబుల్‌గా అభివృద్ధి చేయాలని ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.


భీమారం–కొత్తపల్లి సింగిల్ రోడ్డు ఇదే..

ఈ రోడ్డే కీలకం

భీమారం నుంచి అంకూసాపూర్, ఆరెపల్లి, మద్దికల్ మీదుగా కొత్తపల్లి వరకు నిర్మించిన ఈ రోడ్డే ఈ ప్రాంత రైతులకు కీలకం. పండించిన పంటలు, కూరగాయలు ఇతర ప్రాంతాల్లో విక్రయించాలన్నా, ఎరువులు తెప్పించుకోవాలన్నా ఈ రోడ్డుగుండా వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత వాహనాల రద్దీకి సింగిల్ రోడ్డు బిజీగా మారింది.

డబుల్ రోడ్డు నిర్మిస్తే..

భీమారం–కొత్తపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తే చెన్నూర్ మండలంలోని పలు గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఉటుంది. కొమ్మెర ఎక్స్‌రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు సింగిల్ రోడ్డు ఉంది. దీన్ని డబుల్‌గా నిర్మించాలని డిమాండ్ ఉంది. సింగిల్ రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మద్దికల్, ఆరెపల్లి, కొత్తపల్లి, అంకూసాపూర్ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా డబుల్ రోడ్డుని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డబుల్ రోడ్డు నిర్మించాలి



భీమారం నుంచి కొత్తపల్లి వరకు సింగిల్ రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం. రహదారికి ఇరువైపులా చెట్లు ఆక్రమిస్తున్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం చర్యలు తీసుకుని డబుల్ రోడ్డు నిర్మించాలి.
– పోతం సమ్మయ్య, మద్దికల్

ప్రయాణికులతో వెళ్లడం ఇబ్బందే



సింగిల్ రోడ్డుపై వాహనాల రద్దీ పెరిగింది. ప్రయాణికులతో ఆటోలో వెళ్లడం ఇబ్బందిగా ఉంది. ఎదురుగా వాహనం వస్తే రోడ్డు దిగే పరిస్థితి లేదు.
– ముంజం సమ్మయ్య, ఆటోడ్రైవర్

అకాలీబోధన్..!

- బెంగాలీల ఆధ్వర్యంలో దుర్గాదేవి ప్రత్యేక పూజలు
- నేటి నుంచి అక్టోబర్ 3 వరకు ఉత్సవాలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో స్థిరపడిన బెంగాలీ కాందిశీకులు తమ ఆరాధ్యదైవం కాళీమాతకు మరో రూపమైన దుర్గాదేవిని ప్రత్యేకంగా కొలుస్తారు. అకాలీబోధన్ పిలిచే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకోసం బెంగాలీ కుటుంబాలు జిల్లాకేంద్రమైన విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపాన్ని ముస్తాబు చేశారు. సర్వజనినీ దుర్గాదేవి నిర్వాహక మండలి ఆధ్వర్యంలో సర్వజననీ దుర్గాదేవి (పూజ) 17వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం నుంచి అక్టోబర్ 3 వరకు ప్రత్యేక పూజ కార్యకమాలు చేపట్టనున్నారు. ప్రధాన దేవతామూర్తి దుర్గాదేవిని శక్తి స్వరూపిణిని అయిన త్రినేత్రిగా భావిస్తారు. పార్వతికి ప్రతిరూపమైన దుర్గాదేవితోపాటు అక్కాచెల్లెళ్లు అయిన లక్ష్మీదేవి, సరస్వతీ, కుమారులైన గణపతి, కార్తీకేయ విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. దుర్గాదేవి దశావతరమైన అదృశ్య రూపానికి గుర్తుగా అరటి చెట్టు కాండం ఆకులను చీరకట్టి అలంకరించి పూజ చేస్తారు.

ప్రత్యేక పూజలు ఇలా..

శనివారం సాయంత్రం 6.30 గంటలకు దుర్గాదేవి పంచమి (బోధన్) పూజతో కార్యక్రమాలు మొదలవుతాయి. ఆదివారం దుర్గాషష్టి పూజ నిర్వహిస్తారు. వేదపండితుల ఆధ్వర్యంలో ముందుగా అసురుడైన మహిసాసరిడికి పూజలు చేస్తారు. సోమవారం ఉదయం సప్తమి పూజ, 30న దుర్గాదేవి మహాష్టమి దేవతమూర్తులకు పుష్పాంజలి, పత్రి అక్షింతలతో అభిషేకం చేస్తారు. అక్టోబర్ 1న నవమి పూజ, హోమం, 2న దుర్గా దశమి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బెంగాలీల సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమంలో భక్తులు రాత్రి జాగరణ చేస్తారు. పూజల అనంతరం సింధూర ఉత్సవ్‌లో భాగంగా దేవత విగ్రహాల శోభాయాత్రతో నిర్వహించి గోదావరిలో నిమజ్జనం చేస్తారు.


దుర్గాదేవి, వివిధ దేవతామూర్తులు (ఫైల్)

ఏటా వేడుకలు నిర్వహిస్తాం



ఏటా దుర్గాదేవి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తుంటాం. ప్రతీరోజు అమ్మవారికి హారతి పుష్పాంజలి, పూజలు, మహాప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తాం. బెంగాలీలు ఈ వేడుకలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. – బోడ ధర్మేందర్, సర్వజననీ దుర్గాదేవి కమిటీ నిర్వాహకుడు

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన పినుమల్ల మల్లయ్య(64) శుక్రవారం రైలు ఢీకొని మృతిచెందాడు. రైల్వే ట్రాక్ దాటుతుండగా నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో మల్లయ్య మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

వర్షాలతో బంతిపూల పంటకు నష్టం

భీమారం: మండలంలోని పోతన్‌పల్లిలో ఉస్కమల్ల శ్రీనివాస్ అనే రైతు తన భార్య సుమలత ప్రోత్సాహంతో మూడేళ్ల నుంచి రెండెకరాల్లో బంతిపూల సాగు చేస్తున్నాడు. ఏటా లాభాలు పొందుతున్నా ఈసారి పూలకి మరింత డిమాండ్ ఉంటుందనే నమ్మకంతో పూల తోటపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోరు ద్వారా పూల చెట్లకు నీరు అందించేందుకు డ్రిప్ ఏర్పాటు చేసి నీరందిస్తున్నాడు. అయితే ఏటా బతుకమ్మ పండుగకు పూలు అందుబాటులోకి వచ్చేవి. కానీ ఈసారి అకాల వర్షాల కారణంగా పూలకు పురుగులు పట్టి, తెల్లబూజు ఏర్పడడంతో వ్యాపారులు పూలు కొనుగోలు చేయడం లేదు. పూల సైజు పెరగడం లేదు. ఇప్పటి వరకు రూ.1.70వేలు పెట్టుబడి పెట్టారు. 15క్వింటాళ్ల పూలు అమ్మాల్సి ఉండగా, కేవలం 4క్వింటాళ్ల పూలు మాత్రమే అమ్మినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. పురుగు పట్టి పీడించడమే కాకుండా చెట్లు కిందపడిపోతున్నాయని తెలిపారు. ఈసారి చాలా నష్టపోతున్నట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


సాగు చేస్తున్న బంతి తోట, ఇన్‌సెట్లో రైతు శ్రీనివాస్


అ'పూర్వ' సమ్మేళనం

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి ఆ పాఠశాల వేదికైంది. 19 ఏళ్ల తర్వాత మిత్రులు ఒకేచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందించారు.

కలెక్టర్‌ను సన్మానించిన అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్/పాతమంచిర్యాల/మంచిర్యాలటౌన్: జల సంరక్షణలో జల్ సంచయ్ జన్ భాగీధారి జాతీయ అవార్డు మంచిర్యాల జిల్లాకు దక్కింది. ఇందుకు విశేష కృషి చేసిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి మొక్క అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి అవార్డు రావడానికి ఉపాధి హామీ పథకం పీఎంకెఎస్‌వై సిబ్బంది పాత్ర ఉందన్నారు. డీఆర్‌డీవో కిషన్, జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు నక్క రాజన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈద లింగయ్య, టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, కేంద్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జాడి రామ్ కుమార్, తంగళ్లపల్లి తిరుపతి, రాజేందర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగుల గోపాల్, అజయ్, సంయుక్త కార్యదర్శి సునీత, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, సీవోలు, ఎఫ్ఎస్ఏలు పాల్గొన్నారు.


మొక్క అందిస్తున్న టీజీఈజేఏసీ సభ్యులు

వైభవంగా శరన్నవరాత్రులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్: జిల్లాలో దుర్గాదేవి శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు శుక్రవారం కుంకుమార్చన పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని గౌతమినగర్ శివపంచాయితన ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రతిష్ఠించిన అమ్మవారు శుక్రవారం మహా లక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. విశ్వనాథస్వామి ఆలయంలో శారదా నవరాత్రుల్లో భాగంగా లలితా సేవా సమితి ఆధ్వర్యంలో విశాలక్ష్మీ మాతాకు సహస్ర కమలాల అర్చన చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.


కర్ణమామిడిలో కుంకుమ పూజలో మహిళలు

బతుకమ్మ వేడుకలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/పాతమంచిర్యాల: గుడిపేట కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి రెడ్డి మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. 200ల మంది మహిళలు బతుకమ్మలు తీసుకువచ్చి ఆడిపాడారు. జిల్లా అధ్యక్షురాలు గోనే మణి మాలరెడ్డి, కార్యదర్శి సుధారాణి, పట్టణ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


కేవీలో బతుకమ్మలతో విద్యార్థినులు

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి


గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో..


నస్పూర్: పూలమాల వేస్తున్న నాయకులు


లక్సెట్టిపేటలో..

- నివాళులర్పించిన నాయకులు

మంచిర్యాలటౌన్/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కాసిపేట/నస్పూర్/పాతమంచిర్యాల/దండేపల్లి/లక్సెట్టిపేట: జిల్లావ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ధైర్యశాలి అని పలువురు పేర్కొన్నారు. ఆమె ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.

- జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్ అసోసియేషన్, కుమురం భీం సేవా సమితి ఆధ్వర్యంలో ఆమె జయంతిని నిర్వహించారు. ఫిట్‌నెస్ సెంటర్ అధ్యక్షుడు అచ్చిబాబు, కుమురంభీం సేవా సమితి డైరెక్టర్ చిలువేరు పున్నం, వాకర్ క్లబ్ అధ్యక్షుడు గట్టయ్య, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, జి.రాజన్న, రవి, గౌరన్న, సతీశ్, శంకర్, కృష్ణమూర్తి, శంకర్‌గౌడ్, బాక్సింగ్ కోచ్ రాజేశ్ పాల్గొన్నారు.
- చెన్నూర్ రజక సంఘ భవనంలో నాయకులు కొండపర్తి వెంకటరాజం, అయిలాల రమేశ్ పాల్గొన్నారు.
- గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- కాసిపేట మండలం శుక్రవారం సోమగూడెం చౌరస్తా వద్ద జరిగిన వేడుకల్లో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు కంచర్ల రాజమల్లు, నాయకులు బండి శంకర్, బొడ్డుపెల్లి రాజయ్య, కంచర్ల సాయికుమార్, బండి రాజు, పవన్, సతీశ్ ఉన్నారు.
- నస్పూర్ కాలనీలో రజక సంఘాల సమితి సంఘం మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి పుట్టపాక తిరుపతి, నాయకులు దర్గుల పైడిద్ద, రాజు, అశోక్, శంకర్, ఎల్లయ్య, రాజయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, అంజి, వెంకటేశ్, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని రజక రిజర్వేషన్ సమితి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు సంగెపు ఎల్లన్న, నాయకులు శ్రీకాంత్, శంకర్, తోట మల్లన్న, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.
- దండేపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో అంగడి బజారు సమీపంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేదరిపేటలో పంచాయతీ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, పట్టణ అధ్యక్షుడు అల్వాల సత్తయ్య, ఇస్త్రీ సంఘం మండల అధ్యక్షుడు మందపెల్లి వెంకటేశ్, నాయకులు సత్తయ్య, రఘు, రమేశ్, సాయిప్రకాంత్ పాల్గొన్నారు.
- లక్సెట్టిపేట పాత బస్టాండ్ ఆవరణలో, కొమ్ముగూడెం, రంగపేట గ్రామాల్లో ఆమె జయంతిని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, కాంగ్రెస్, రజక సంఘం నేతలు ఉన్నారు.


దండేపల్లిలో..


చెన్నూర్ రజక సంఘ భవనంలో..


పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు


నివాళులర్పిస్తున్న వాకర్ అసోసియేషన్ సభ్యులు


సోమగూడెంలో..

కల్తీ మద్యం అరికట్టాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో కల్తీ మద్యం అరికట్టాలని కోరుతూ జిల్లా అబ్కారీశాఖ అధికారి నందగోపాల్‌కు బీఎస్పీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దసరా సందర్భంగా జిల్లాలో మద్యం షాపు నిర్వాహకులు అక్రమార్జనే ధ్యేయంగా కల్తీ మద్యం విక్రయించి పలువురు అనారోగ్యాల బారిన పడేలా చేస్తున్నారన్నారు. గుడుంబా, నాటుసారా ముడిసరుకు విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ నాయకులు కుమ్మరి కృష్ణ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీలకు ఎంపిక


సాయికుమార్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సత్తాచాటి కోలిండియా పోటీలకు ఎంపికయ్యాడు. ఏఎల్‌పీ ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కంపెనీ లెవల్ షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో గెలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఏరియా జీఎం రాధాకృష్ణ, అధికారులు, క్రీడాకారులు సాయికుమార్‌ను అభినందించారు.

నిత్యావసరాలు పంపిణీ

పాతమంచిర్యాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా నష్టపోయిన ముంపు బాధితులకు లయన్స్ ఇంటర్నేషనల్ సభ్యులు పట్టణంలో లయన్స్ భవన్‌లో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. 25 వరద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరి రూ.6 వేల విలువ చేసే సరుకులు అందజేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జి గవర్నర్ సింహరాజు కోదండరాములు, జిల్లా ప్రథమ ఉప గవర్నర్ మోర భద్రేశం, సెక్రెటరీ వాసుదేవ రెడ్డి, ట్రెజరరీ వాసుదేవారెడ్డి, జిల్లా ఎల్ఐసీఎఫ్ కోఆర్డినేటర్ ఉదారి చంద్రమౌళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్టీయూసీ కృషి ఫలితంగానే మెరుగైన బోనస్'


సంబరాల్లో శంకర్‌రావు, నాయకులు

నస్పూర్: ఐఎన్టీయూసీ కృషి ఫలితంగానే కార్మికులకు మెరుగైన పీఎల్ఆర్ దీపావళి బోనస్ వస్తుందని ఆ సంఘం సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. కార్మికులకు మెరుగైన బోనస్ సాధించిన సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు శుక్రవారం ఎస్సార్పీ 3 గనిపై సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ బోనస్ రూ.1,03,000 చెల్లించేందుకు కోల్ ఇండియా యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కేంద్ర కమిటీ నాయకులు సీహెచ్.భీమ్‌రావు, గరిగ స్వామి, కలవేణ శ్యామ్, తిరుపతి రాజు, పేరం రమేశ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, ల్యాగాల శ్రీనివాస్, మనోజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.